www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
తెలంగాణ దిక్సూచి
శనివారం | 14 | నవంబర్ | 2026 | పేజీలు: 08

బాలల భద్రతకు భరోసా

బాల్యానికి భరోసా భవితకు బాట

కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి: బాలల హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం, వివిధ శాఖలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



ఫాక్స్ సాగర్ పునరుజ్జీవం

చెరువుకు మళ్లీ జీవకళ
ప్రగతి పనులకు హైడ్రా శ్రీకారం
మురుగు, రసాయన వ్యర్థాల తొలగింపు
వరద ముప్పు నివారణకు ప్రత్యేక ప్రణాళిక
మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు తరహా అభివృద్ధి
నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

మేడ్చల్, అక్షిత బ్యూరో: ఫాక్స్ సాగర్‌కు పునరుజ్జీవం. చెరువుకు మళ్ళీ జీవకళ ఉట్టిపడుతుంది. 482.60 ఎకరాల ఫాక్స్ సాగర్ చెరువు పునరుజ్జీవనానికి హైడ్రా నడుం బిగించింది.ఫాక్స్ సాగర్, ఆక్రమణలు, మురుగు నీరు, రసాయన వ్యర్థాలతో తన పూర్వ వైభవాన్ని ..మిగతా 2లో

సిద్దిపేట నుంచే సమరశంఖం!

హరీష్‌పై కవిత సమరభేరి
సిద్దిపేటలో రాజకీయ సమరం
హరీష్ లక్ష్యంగా కవిత గురి
పార్టీ కార్యాలయ భూమి పూజలో
టీఆర్ఎస్ చీఫ్ కవిత
మల్లన్న సాగర్‌లో లీకేజీలు
రూ.9,600 కోట్ల ప్రాజెక్టుపై విచారణేది?
హరీష్ రావుపై విచారణకు ఆదేశించాలి
అవినీతిపరులకు ఇంకెంత కాలం అధికారం
టీఆర్ఎస్ చీఫ్ కవిత



సిద్దిపేట, అక్షిత బ్యూరో : సిద్దిపేట రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. టీఆర్ఎస్ పార్టీ చీఫ్ కవిత హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సిద్దిపేట పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. సిద్దిపేట నుంచే తమ రాజకీయ పోరాటాన్ని ప్రారంభిస్తున్నట్లు ..మిగతా 2లో

పేదల బతుకుల్లో భరోసా

సంక్షేమానికి పెద్దపీట
పించన్లతో చేయూత
నేలకొండపల్లిలో లబ్ధిదారులకు పించన్ల ఆర్డర్ల పంపిణి

రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



ఖమ్మం /అక్షిత బ్యూరో : పేదింటి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ హౌజింగ్ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి నేలకొండపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ..మిగతా 2లో

పేదల బతుకుల్లో భరోసా

మొదటి పేజీ తరువాయి...

కార్యక్రమంలో నేలకొండపల్లి మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు 7-8 సంవత్సరాల నుంచి భర్తలను కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆడబిడ్డల బాధలను గతంలో గ్రామాల్లో నేరుగా వారి ఇంటికి వెళ్లినప్పుడు ప్రత్యక్షంగా చూశామని వారి మనసులోని వేదనను స్వయంగా పంచుకున్నామని తెలిపారు. కేవలం ఆడబిడ్డలే కాకుండా వికలాంగులు గీత కార్మికులు నేత కార్మికులు ఇలా వందలాది మంది పడిన వేదనను ఈ ప్రజా ప్రభుత్వం స్వయంగా చూసిందని అన్నారు.హౌ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాళ్లకు అండగా నిలవాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్ అందించాలనే లక్ష్యంతో మొన్న దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి పైగా అర్హులకు పింఛన్లు అందజేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత 7-8 సంవత్సరాలుగా కాళ్లు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగిన మహిళలకు దీపావళి నాడు వారి ఇంట్లోనే శుభవార్త చెప్పడం జరిగిందని తెలిపారు.

సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతన్నలకు మొదటి పంటకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

కాళేశ్వరం కడితే లక్ష కోట్లు కమీషన్ వస్తుంది కాని, పేదోడికి ఇళ్లు ఇస్తే కమీషన్ రాదన్న దురుద్ధితో గత పాలకులు వ్యవహరించారని కానీ ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని అలాగే హైదరాబాదులో ఒక లక్ష ఇళ్లు, మొత్తం 8 లక్షల ఇళ్లు రూ. 40 వేల కోట్లతో పేద ఆడబిడ్డలకు ఇస్తున్నామని తెలిపారు.హౌజాతీయ పార్టీలు కుల మతాలకతీతంగా పింక్ షర్టు వేసుకుని వచ్చినా అర్హులైన ప్రతి పేద మహిళకు ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు.హౌచేయూత పింఛనుల కోసం ఎవరైనా అర్హులు మండలానికి ఒకరిద్దరు మిగిలిపోయి ఉంటే వారిని కూడా విస్మరించకుండా త్వరలోనే న్యాయం చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో కె. శ్రీరామ్ హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్ నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఎంపిడిఓ ఎర్రయ్య తహసీల్దార్ రాంప్రసాద్ మండలంలోని పలు గ్రామాల సర్పంచులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట నుంచే సమరశంఖం!

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించారు. రానున్న మున్సిపల్, సాధారణ ఎన్నికల్లో పోటీ చేసి సిద్దిపేట నియోజకవర్గంలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో మొదటి, హైదరాబాద్‌లో రెండో పార్టీ కార్యాలయ కార్యక్రమం నిర్వహించామని, సిద్దిపేటలో మూడో కార్యాలయానికి మంచి రోజు కావడంతో భూమిపూజ చేసినట్లు తెలిపారు. సిద్దిపేట తన పుట్టిన జిల్లాతో పాటు తెలంగాణ ఉద్యమాలకు కీలక కేంద్రంగా నిలిచిందన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం రాదని కొందరు అన్నప్పటికీ, కేసీఆర్ ఇక్కడి నుంచే ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. సిద్దిపేట నుంచే పోరాటం ప్రారంభిస్తే విజయం సాధించవచ్చనే నమ్మకంతో ఇక్కడికి వచ్చినట్లు వెల్లడించారు.. రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు నాయకులు వారి వద్దకు వెళ్లాలని, ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఐదు ప్రధాన అంశాలతో ప్రజల్లోకి వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేట జిల్లాలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన ప్రయోజనాలపై సమీక్ష జరగాలని అన్నారు.హరీష్ రావు లక్ష్యంగా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని ఆయనకు అప్పగించిన తీరు, కేసీఆర్‌తో ఆయన వ్యవహరించిన విధానంపై విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌కు హరీష్ రావు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలు భయంతో జీవిస్తున్నారని, సిద్దిపేటకు ఇంకా నిజమైన స్వాతంత్ర్యం రాలేదని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో టీఆర్ఎస్ పార్టీ ద్వారానే సిద్దిపేట ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. 2004లో సిద్దిపేటలో 124 రైస్ మిల్లులు ఉండేవని, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటో పరిశీలించాలని సూచించారు. పెద్ద కార్పొరేట్ సంస్థలను తీసుకొచ్చి స్థానిక మిల్లుల యజమానులను కూలీలుగా మార్చారని హరీష్ రావుపై ఆరోపణలు చేశారు. తాము అధికారంలోకి వస్తే స్థానిక వృత్తిదారులకు, ముఖ్యంగా పూసల మట్టెల తయారీని సంప్రదాయంగా కొనసాగించే మహిళలకు ప్రోత్సాహం కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫాక్స్ సాగర్ పునరుజ్జీవం

మొదటి పేజీ తరువాయి...





కోల్పోయింది. చారిత్రక ప్రాధాన్యమున్న ఈ జలాశయానికి మళ్లీ జీవం పోసి, స్వచ్ఛమైన నీటి నిల్వతో పాటు పర్యావరణహితమైన ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా నడుం బిగించింది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల ఫాక్స్ సాగర్ అభివృద్ధి పనులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ (ఐపీఎస్) వివిధ శాఖల అధికారులతో కలిసి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు భావితరాలకు విలువైన నీటి వనరులను అందిస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే చెరువుల పరిరక్షణ, అభివృద్ధి ఒక్కటే మార్గమన్నారు. కొన్నేళ్లుగా ఆక్రమణలు, కాలుష్య కోరల్లో చిక్కుకున్న ఫాక్స్ సాగర్‌ను మరో ఏడాది కాలంలో హైదరాబాద్‌కు నీరు అందించే పూర్వపు సరస్సు రూపంలో చూస్తారని హామీ ఇచ్చారు. చెత్త, రసాయన వ్యర్థాలను తొలగించి, నీటిని నిల్వ చేసేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

వరద నివారణకు చర్యలు

మొత్తం 482.60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో 120.60 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వీటిలో 14.46 ఎకరాల మేర నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన కట్ట నుంచి 10 మీటర్ల పరిధిలోని ఆక్రమిత నిర్మాణాలను తొలగించనున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని నివాస సముదాయాల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు లేదా మరోచోట ఇళ్ల నిర్మాణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కమిషనర్ తెలిపారు. ఉమామహేశ్వర కాలనీ వాసులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాణిజ్య షెడ్ల విషయంలో మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.

పూడికతీత, చెరువు లోతు పెంపు పనులతో పాటు వరద నీరు చెరువులోకి చేరేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తారు. మూసుకుపోయిన సర్‌ప్లస్ నాలాలను పునరుద్ధరించి, కాలువల మళ్లింపు చేపడతారు. 2000 సంవత్సరంలో ఫాక్స్ సాగర్ పరిసర ప్రాంతాల్లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నారు.

మినీ ట్యాంక్‌బండ్ బోటింగ్ సదుపాయాలు

చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఈటీపీ), రీసైక్లింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. నీటి నాణ్యతపై ప్రస్తుత నమూనాలను పరీక్షించి, ఏడాది తర్వాత మరోసారి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మార్పులను వెల్లడిస్తారు. బ్రిటిష్ ఇంజినీర్లు నిర్మించిన చారిత్రక గేట్లను మరమ్మతు చేసి వారసత్వ లక్షణాలను పునరుద్ధరిస్తారు. అవసరమైతే యూరప్ నిపుణుల సేవలు వినియోగించుకోనున్నారు. చెరువు పరిధిలోని చారిత్రక ఆలయాలను తొలగించబోమని స్పష్టం చేశారు. మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు తరహాలో రింగ్‌రోడ్డు సర్కిల్, వాకింగ్ ట్రాక్‌లు, ఆధునిక పార్కులు, ఓపెన్ జిమ్‌లు, బోటింగ్ వంటి వినోద సదుపాయాలు కల్పించనున్నారు. పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించనున్నారు. పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ, వాటర్‌బోర్డు, సైబరాబాద్ మున్సిపల్ విభాగాల సమన్వయంతో పనులు సాగనున్నాయి. 18 నెలల అంచనా గడువుతో చేపట్టిన ఈ ప్రాజెక్టును 2027 నవంబరు లేదా డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూమిపూజ కార్యక్రమంలో ప్రాజెక్టు కాంట్రాక్టర్ దామోదర్ మంజునాథ్, హైడ్రా అధికారులు యూనుస్, ఆదిత్య గౌడ్, వేణు, మేధ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, కొంపల్లి ట్రాఫిక్ సీఐ క్రాంతికుమార్, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల భద్రతకు భరోసా

మొదటి పేజీ తరువాయి...

కలెక్టర్ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

అనంతరం మాట్లాడుతూ.. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. పిల్లలు సంతోషంగా, స్వేచ్ఛగా జీవితాన్ని గడిపేందుకు, వారి అభిరుచులు, ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రతి చిన్నారికి జీవించే హక్కు, విద్యను పొందే హక్కు ఆరోగ్యంగా ఉండే హక్కు, రక్షణ పొందే హక్కు ఉన్నాయని పేర్కొన్నారు. బాలల హక్కులకు ఎక్కడైనా భంగం కలిగితే పోలీసు, వైద్యారోగ్య, విద్య, న్యాయశాఖలతో పాటు మహిళా, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు వారికి అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని పిల్లలకు సూచించారు. వివిధ కారణాలతో తల్లిదండ్రులకు దూరమైన పిల్లలను తిరిగి వారి కుటుంబాలకు చేరువ చేసేందుకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలల భద్రత, హక్కులు, చట్టపరమైన రక్షణ, సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు పిల్లలకు అవగాహన కల్పించాలని



సూచించారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా, ఉత్సాహంగా, ఆనందంగా ఉండటమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం, అభివృద్ధి పనులు బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందిస్తున్నామని చెప్పారు. వారికి మెరుగైన వాతావరణం, విద్య, వసతులు, పౌష్టికాహారం అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని వివరించారు.

పిల్లలు ప్రస్తుతం తమ జీవితంలో ఎంతో విలువైన బాల్య దశలో ఉన్నారని, ఈ సమయాన్ని ఆనందంగా గడుపుతూ కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల పట్ల ఓర్పు, సహనంతో వ్యవహరించాలని కోరారు. పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి అభిరుచులకు తగిన అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతం కలెక్టర్‌ను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఎంతో చక్కగా, ఏకాగ్రతతో పాటలను నేర్చుకుని ఆలపించడం అభినందనీయమని ఆమె ప్రశంసించారు. పిల్లల స్వచ్ఛమైన మనసు, నేర్చుకునే ఆసక్తి పెద్దలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తాము కూడా వారి నుంచి స్ఫూర్తి పొంది పాటలను నేర్చుకోవాలని కలెక్టర్ అన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ బాలల సంరక్షణ సంస్థల్లో చిత్రలేఖనం, పెయింటింగ్, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, కబడ్డీ తదితర క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సి సి ఐ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, వివిధ బాలల సంరక్షణ సంస్థలకు చెందిన చిన్నారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సాక్షిగా అభివృద్ధి పనులు..

అభివృద్ధి అంటే జీవోలు, పత్రికా ప్రకటనలకే పరిమితం కాదు..

రూ.2.33 కోట్లతో 61,63,8 వ డివిజన్ లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాజీపేట్, అక్షిత ప్రతినిధి : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

నియోజకవర్గ పరిధిలోని 61వ డివిజన్ ప్రశాంత్ నగర్, 63వ డివిజన్ తిలక్ నగర్,8 వ డివిజన్ మార్కస్ స్కూల్ ఆవరణలో సుమారు రూ.2.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ క్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దీత గడువులో పనులను పూర్తి చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ప్రజాపాలనలో భాగంగా అభివృద్ధి అంటే కేవలం జీవోలు తీసుకురావడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, ప్రెస్‌మీట్లు నిర్వహించడం మాత్రమే కాదని, ప్రజల సాక్షిగా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించి, వాటిని పూర్తి చేసి చూపించడమే నిజమైన అభివృద్ధి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈరోజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటు నాణ్యతా నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయా డివిజన్ ల ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మిక తనిఖీ



జడ్చర్ల ,అక్షిత న్యూస్: జడ్చర్ల మండలం నస్రుల్లాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధులకు గైర్హాజరైన ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని (డీఈఓ) ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

తిరుమలగిరిలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్న మహిళలు

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న మండల కేంద్రం



తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి: మండల కేంద్రంలో నాగుల చవితి పర్వదిన వేడుకలను మహిళలు, ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఉదయాన్నే తలస్నానాలు ఆచరించిన మహిళలు సాంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి, పూజా సామాగ్రితో సమీపంలోని నాగపుట్టల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

ఈ సందర్భంగా పుట్టల వద్ద పసుపు, కుంకుమలు చల్లి, పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగదేవతకు ఆవు పాలు, కోడిగుడ్లు, నువ్వుల ఉండలు, చలిమిడి, వడపప్పు వంటి సాంప్రదాయ నైవేద్యాలను భక్తితో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని నాగదేవతను వేడుకున్నారు.

సోనియా గాంధీ జీవిత స్మృతుల పుస్తకం అందుకోవడం ఆనందంగా ఉంది

కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం



షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ రచించిన జీవిత స్మృతుల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' తన చేతికి చేరడంతో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పుస్తకం కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నానని, ఎట్టకేలకు తన చేతుల్లోకి రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ప్రేమ, త్యాగం, సహనం, పట్టుదల, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా అధిగమించే మనోనిబ్బరం వంటి విలువైన అంశాలను ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. సోనియా గాంధీ వ్యక్తిగత అనుభవాలు, కుటుంబ అనుబంధాలు, భారతదేశంతో ఆమెకు ఉన్న అనుబంధం, జీవిత ప్రయాణంలోని అనేక మలుపులను తెలుసుకునేందుకు ఈ పుస్తకం మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. పుస్తకంలోని ప్రతి పేజీ నుంచి ఎన్నో జీవిత పాఠాలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు తెలుసుకోవాలనే ఆసక్తితో ఈ రాత్రి నుంచే పుస్తక పఠనం ప్రారంభించనున్నట్లు విశాల శ్రవణ్ రెడ్డి వెల్లడించారు. ఈ పుస్తకం కేవలం జీవిత స్మృతుల సమాహారం మాత్రమే కాకుండా ప్రేమ, అనుబంధం, త్యాగం, మానవీయ విలువలను పరిచయం చేసే ఒక ప్రయాణమని ఆమె పేర్కొన్నారు..

కేజీబీవీలో బాల్య వివాహాల నివారణ,ఆరోగ్యంపై అవగాహన



అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి: బాల్య వివాహాల నిర్మూలన,కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్య పరిరక్షణ,వ్యక్తిగత పరిశు భ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ అజహర్ అహ్మద్ బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక,మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు.కౌమారదశలో పౌష్టికాహారం తీసుకోవడం,వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం,రుతుక్రమ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు.సీడీపీవో శాంతి బాల్య వివాహాల నివారణలో కుటుంబాలు,సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి బాలికల సంక్షేమం,ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల నివారణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాయుడు బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా,అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.అనంతరం పాఠశాలలోని విద్యార్థినులందరికీ రక్తహీనత (అనీమియా) నిర్ధారణ పరీక్షలు నిర్వహించి,అవసరమైన వైద్య సూచనలు అందించారు.బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని,ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ఎస్.ఓ బి.స్వప్న,స్టాఫ్ నర్సు సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ మురళీకృష్ణ,కేజీబీవీఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఈ నెల 16న ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అక్షిత బ్యూరో, మంచిర్యాల : తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన (సాధారణ ప్రజావాణితో పాటు) ప్రత్యేకంగా "పిల్లల ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాలలకు సంబంధించిన వ్యక్తిగత, సామాజిక సమస్యలు, ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకొని, పిల్లలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తెలియజేయవచ్చని వివరించారు.

ఘనంగా ప్రజాకవి కాళోజీ వర్ధంతి వేడుకలు



కరీంనగర్ అక్షిత బ్యూరో: తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి, పద్మవిభూషన్..కాళోజి నారాయణరావు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కాళోజి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజీ నారాయణ రావు వర్ధంతి వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా జరిగాయి. రేకుర్తిలోని కాళోజీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాళోజీ నారాయణ రావు విగ్రహానికి మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు కార్పొరేటర్లు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాళోజీ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజి నారాయణ రావు అని, నేటితరాలకు ఆదర్శ ప్రియుడని తెలిపారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అని నినాదించిన.. ప్రజాకవి కాళోజి జీవితం అంతా తెలంగాణ భాష సాహితి సేవ దిశగా సాగిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి- కృష్ణగౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం లక్ష్మీ-ప్రకాష్, గాజ రమ-శివరాం, స్థానిక నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు మహమ్మారికి యువత చరమగీతం పాడాలి!

నషా ముక్త యువతతోనే వికసిత భారత్ సాధ్యం

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలి

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్,అక్షిత ప్రతినిధి,నవంబర్ 13 : మాదకద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును ఛిద్రం చేస్తోందని, మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి యువకుడు బాధ్యత తీసుకోవాలని, ఆరోగ్యవంతమైన యువతతోనే వికసిత భారత్ కల సాకారమవుతుందని పేర్కొన్నారు.



నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'నషా ముక్త యువ -- వికసిత్ భారత్' అంశంపై నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువత జీవితాలపై వాటి ప్రభావం, మత్తు పదార్థాల నియంత్రణలో యువత పోషించాల్సిన పాత్రపై చర్చించారు.

యువశక్తి దేశానికి వెన్నెముక

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. యువతలోని అపారమైన శక్తి సామర్థ్యాలను వ్యక్తిగత అభివృద్ధితోపాటు దేశ ప్రగతికి వినియోగించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సమాజంలో విస్తృత అవగాహన కల్పిస్తూ, మత్తు రహిత భారతదేశ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జమాల్, జిల్లా యువజన అధికారి రమేష్, కౌన్సిలర్లు సాదం అరవింద్, గంజి రాజు, జింక సురేందర్, శ్రీరామోజీ నరేష్, కూన శశాంక్, ఈశ్వర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, భరత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

ఘనంగా సింగరేణి క్రికెట్ పోటీలు ముగింపు

విజేతగా శ్రీరాంపూర్ జట్టు.. రన్నరప్‌గా మణుగూరు--ఇల్లందు



మందమర్రి, అక్షిత ప్రతినిధి: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026--27 ఆర్థిక సంవత్సరపు కంపెనీ స్థాయి క్రికెట్ పోటీలు మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విజేతగా నిలవగా, మణుగూరు ఇల్లందు సంయుక్త జట్టు రన్నరప్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని క్రీడాకారులకు సూచించారు. మూడు రోజులపాటు క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. సింగరేణిలో క్రీడా, సంక్షేమ కార్యక్రమాలు మరింత వైభవంగా నిర్వహించుకోవాలంటే సంస్థను ఐక్యంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో చూపుతున్న ఉత్సాహాన్ని విధి నిర్వహణలోనూ ప్రదర్శిస్తూ, రక్షణ ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. సంస్థ లాభాల బాటలో పయనించి నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నప్పుడే ఇటువంటి క్రీడా వేడుకలను మరింత ఘనంగా నిర్వహించుకోవడం సాధ్యమవుతుందన్నారు.క్రీడల అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. కంపెనీ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రానున్న కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో సింగరేణి కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, కేకే గ్రూప్ ఏజెంట్ ఖాదిర్, ఏఐటీయూసీ నాయకుడు ఇప్పకాయల లింగయ్య, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు ఎం. నరేందర్ రెడ్డి, పరస్న శ్రీనివాస్, మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివ, వివిధ కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు బహిరంగ సభను జయప్రదం చేయండి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జహంగీర్



చౌటుప్పల్ /అక్షిత న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో వీడు భూములకు సాగునీరు అందించే ప్రాజెక్టుల కోసం, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయం చేయాలని, పంట రుణాలు, నాన్యమైన ఎరువులు, విత్తనాల సరఫరా చేయాలని దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై పోరాటం చేసి సాధించిన రైతు సంఘం జాతీయ మహాసభలు నల్లగొండలో నిర్వహించడం జరుగుతుందని ఈ సభల సందర్భంగా ఈనెల 15న జరిగే రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎండి జహంగీర్ తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం దేశ స్వాతంత్రాన్ని సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టే విధంగా ఉందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా వ్యవసాయరంగం రక్షణ కోసం రైతు సంఘం నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రద్దయ్య కొరకు సమరసిల పోరాటం రైతు సంఘం చేసి సాధించినదని అన్నారు. ముఖ్యంగా నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఎస్ఎల్బీసీ స్వరంగ పనులకు త్వరగా పూర్తిచేయాలని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ మునుగోడు ప్రాంతాలకు సాగునీరు అందించాలని, మూసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఆధునికరణ కోసం పలు రకాల ఆందోళనను చేయడం జరిగిందని అన్నారు. రైతు సంఘం దేశవ్యాప్తంగా రైతుల కార్మికుల సమస్యలపై పోరాటం చేసి సాధించిన చరిత్ర రైతు సంఘానికి ఉందని కొనియాడారు. ఈ తరుణంలో వీర తెలంగాణ పోరాటాల పురిటి గడ్డ నల్లగొండలో జరిగే అఖిల భారత రైతు సంఘం మహాసభలు నిర్వహించడం జరుగుతుంది కావున బహిరంగ సభకు రైతులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, ఊష్కగుల శ్రీనివాస్, ఉస్కగుల రమేష్, తూర్పు నుండి మల్లేశం, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బొద్దు రాజు, ఆర్టీవో పాషా, కందగట్ల ఆనంద్, ఎండి రేష్మ, గుణముని అయిలయ్య, కలకుంట శివ, బిక్షపతి పాల్గొన్నారు.

కాళోజీ గొప్ప ప్రజా కవి

రక్తదానం ఒక మానవతా ఉద్యమం

పి.భవాని



నల్గొండ, అక్షిత ప్రతినిధి : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ప్రజల కష్టాలను, కన్నీళ్లను, ఆకాంక్షలను తన కవిత్వంలో ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని 'కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్' నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు పి.భవాని అన్నారు.కాళోజీ తన జీవితాంతం ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను, అక్రమాలను,సామాజిక అసమానతలను ప్రశ్నించారని పేర్కొన్నారు.తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కాళోజీ నారాయణరావు గారి 24వ వర్ధంతి సందర్భంగా నవంబర్ 13న నల్లగొండ బార్ అసోసియేషన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు నల్లగొండ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.సతీష్ కుమార్, కార్యదర్శి బి.అశోక్ కుమార్ ప్రారంభించారు.కాళోజి అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షురాలు పి. భవాని మాట్లాడుతూ కాళోజీ కవిత్వం కేవలం సాహిత్యానికి మాత్రమే పరిమితం కాలేదని,అది ప్రజల్లో చైతన్యాన్ని నింపిన సామాజిక ఉద్యమమని అన్నారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండటమే కాళోజీకి మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు.కాళోజీ ఆశయాల్లో మానవత్వానికి అత్యంత ప్రాధాన్యత ఉందని, మనిషిని మనిషిగా గౌరవించడం,కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని భవాని పేర్కొన్నారు.ఈ స్ఫూర్తితోనే ఆయన వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. రక్తదానం అనేది మరొక మనిషికి ప్రాణం పోసే గొప్ప మానవతా కార్యక్రమమని అన్నారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాలు,ఇతర వైద్య అవసరాల్లో రక్తం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు.ఆరోగ్యపరంగా అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదానం ద్వారా సమాజంలో సమానత్వం, సహకారం, సేవాభావం వంటి విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని, మహిళా న్యాయవాదులు న్యాయస్థానాల్లో న్యాయం కోసం పోరాడటమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమని అన్నారు.న్యాయవాద వృత్తి అనేది కేవలం వృత్తిపరమైన బాధ్యత మాత్రమే కాదని, సమాజం పట్ల బాధ్యతను కూడా కలిగి ఉంటుందని పేర్కొన్నారు.

కాళోజీ వర్ధంతిని కేవలం స్మరణ కార్యక్రమంగా కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మాటలతో నివాళులు అర్పించడం కంటే చేతల్లో మానవత్వాన్ని చాటడం గొప్ప విషయమని అన్నారు.భవిష్యత్తులో కూడా కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సామాజిక చైతన్యం, మానవతా విలువలు, ప్రజాసేవ లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పి.భవాని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పజ్జూరి స్వామి గౌడ్,నూకల సంధ్యారాణి, బార్ అసోసియేషన్ సభ్యులు పందుల సైదులు,నాంపల్లి భాగ్య, స్వామి దాస్,న్యాయవాదులు పి.శ్రీనివాస్ రెడ్డి, ఎం.వి. రాఘవరావు,ఎస్.శ్రీనివాస రెడ్డి, జె.లక్ష్మణ్, నాగిరెడ్డి, మామిడి ప్రమీల,పజ్జూరి ఇందిర,తడకమల్ల వరుణ, దర్శనం ప్రియాంక, ముక్కెర శ్రీనివాస్,అంజనా యాదవ్, ఎం.నరేష్, సిహెచ్.సతీష్ కుమార్,మానుపాటి శ్రీకాంత్, పిట్ట సతీష్ అనేకమంది సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం సంతోషకరమని అన్నారు.



పి.భవాని
కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నల్గొండ జిల్లా అధ్యక్షురాలు

నిరుద్యోగులను మోసగిస్తున్న పాలకులు

నిరంతరం పట్టభద్రుల అభివృద్ధికి కృషి
వరంగల్,ఖమ్మం,నల్లగొండ ఎమ్మెల్సీ అభ్యర్థి
డా, నలమాస శ్రీకాంత్ గౌడ్





వరంగల్, అక్షిత బ్యూరో: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు దారుణంగా విఫలమయ్యాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ వరంగల్, నల్లగొండ,ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్,తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త సయ్యద్ ఇస్మాయిల్ విమర్శించారు.. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా పనిచేసినవారు నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని అన్నారు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ ఇస్మాయిల్, ఆ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ పర్యటించారు.. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పర్యటించి అక్కడ పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న నిరుద్యోగులతో కొద్దిసేపు మాట్లాడారు.. గత ప్రభుత్వాలు నిరుద్యోగులను ఎలా మోసం చేశారో వారికి వివరించారు..అనంతరం సింగరేణి జిఎం కార్యాలయంలో పర్యటించి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమకు సహకరించాలని జిఎంను ,అక్కడ పనిచేసే ఉద్యోగులను కోరారు.. ఆ తర్వాత లాయర్లతో ,కలెక్టర్ కార్యాలయంలో పర్యటించి అక్కడ పనిచేసే ఉద్యోగస్తులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని శ్రీనివాస్ కోరారు..

ఈ సందర్భంగా మీడియా మిత్రులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు.. విద్యార్థినేతగా, ఉద్యమ నేతగా తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని నలమాస శ్రీనివాస్అన్నారు..నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.. గత బిఆర్ఎస్ పాలనలో విద్య వ్యాపారమైందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు..తెలంగాణ కోసం పోరాడిన నేను, అవకాశం ఇస్తే నిరుద్యోగుల కోసం పోరాడుతానన్నారు.. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవితక్క ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.. ఇప్పటికైనా యువత, నిరుద్యోగులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నరేష్ నేత, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ సమావేశం

నూతన కోర్ కమిటీ ఎన్నిక



కోదాడ అక్షిత ప్రతినిధి: కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో సభ్యులందరూ కలిసి నూతన కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీలో ఖాళీగా ఉన్న సెక్రెటరీ పోస్టును కూడా భర్తీ చేశారు.సెక్రెటరీగా పాస్టర్ జోసఫ్ రాజు ఎన్నికయ్యారు నూతన కోర్ కమిటీ సభ్యులు, కమిటీ చైర్మన్ రేవ డాక్టర్ వి యెషయా, -వర్కింగ్ చైర్మన్ యేసు పాదం , చిలుకూరు చీఫ్ కోఆర్డినేటర్ పాస్టర్ ప్రసాద్ , కాపుగల్లు చీఫ్ ఆర్గనైజర్ పాస్టర్ యేసు రత్నం , ఈ నూతన కమిటీని సేవకులందరూ బలపరిచి ప్రార్థించారు. ఈ కమిటీ దేవుని నామములో బలంగా పనిచేయునట్లు అందరూ ప్రార్థించగలరు.

దేవునికి మహిమ కలుగును గాక! ఆమేన్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కోదాడ నియోజకవర్గ పాస్టర్స్ అధ్యక్షులు బ్రదర్ రామారావు , వర్కింగ్ అధ్యక్షులు పాస్టర్ రమేష్ , ట్రెజరర్ పాస్టర్ పాల్ చారి . చిలుకూరు మండల అధ్యక్షులు అబ్రహం , అనంతగిరి మండల అధ్యక్షులు పాస్టర్ రాజేష్ , మోతే మండల అధ్యక్షులు పాస్టర్ లాజరస్ , మునగాల మండల అధ్యక్షులు పాస్టర్ సిలువ రాజు , నడిగూడెం మండల అధ్యక్షులు పాస్టర్ గాబ్రియేల్ , టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ ప్రభుదాస్, వివిధ మండలాల కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

బాలల హక్కుల పరిరక్షణకు బాధ్యతగా ముందుకు రావాలి

నవంబర్ 14 నుంచి 20 వరకు
బాలల హక్కుల వారోత్సవాలు



వరంగల్, అక్షిత బ్యూరో: వరంగల్ నగరంలోని శివనగర్ డాన్ బాస్కో నవజీవన్ కేంద్రంలో శుక్రవారం బాలల హక్కుల వారోత్సవాల నిర్వహణకు సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వాలంటరీ అడ్వకసీ యాక్షన్ ఫర్ చిల్డ్రన్ అధ్యక్షులు ఫాదర్ థామస్ కోషి, ప్రధాన కార్యదర్శి మండల పరశురాములు మాట్లాడుతూ, ప్రతి బాలబాలికకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వారి హక్కులను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలల హక్కుల ఉల్లంఘనలను సంబంధిత జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణించి, బాలల హక్కులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ తదితర అన్ని రంగాల్లో బాలల హక్కులను కాపాడినప్పుడే మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.

నవంబర్ 14 నుంచి 20 వరకు వరంగల్, హనుమకొండ నగరాల్లోని వలస కార్మికుల పిల్లలు, మురికివాడల్లో నివసించే పిల్లల సంక్షేమం, విద్య, అభివృద్ధి, రక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఎఫ్,ఎం , ఎం.సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సహాయ, శ్రీకాంత్, కరుణ, సంయుక్త కార్యదర్శి డా,పాలడుగుల సురేందర్, డాన్ బాస్కో ప్రాజెక్ట్ మేనేజర్ కరుణాకర్, దివ్య, శారద, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వనపర్తి అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం చర్లపల్లి, అప్పరాల, గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను పామాపూర్ సింగల్ విండో అధ్యక్షుడు నాగారపు బిచుపల్లి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఒడ్ల కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభిస్తున్నందుకు. దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డికి,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు, అపరాల సర్పంచ్ మనన్న,చర్లపల్లి సర్పంచ్ సూదిని శోభ శేఖర్ రెడ్డి, పామాపుర రామాపూర్ సింగల్ విండో డైరెక్టర్లు కృష్ణారెడ్డి, మాధవ్, నాగమ్మ, శేఖర్ రెడ్డి, రాములు, భారతీయ్య,చెన్నప్ప, వెంకటేష్,చిన్నపాక దేవమ్మ, ధర్మానాయక్,ఎల్లారెడ్డి, పరమేష్ గౌడ్, కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేశీ పెంటన్న యాదవ్,వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమిట్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యలు బాధ్యతారాహితం

తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీసేలా విమర్శలు చేయడం సరికాదు

డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్



కరీంనగర్ అక్షిత బ్యూరో: భారత్ సమిట్‌పై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నానని కరీంనగర్ డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ పేర్కొన్నారు. భారత్ సమిట్‌ను దేశ వ్యతిరేక శక్తుల కోసమే నిర్వహిస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించడం, అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి "భారత్ సమిట్ కాదు.. దేశ వ్యతిరేక సమిట్" అంటూ విమర్శలు చేయడం వారి రాజకీయ సంకుచిత వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, ప్రపంచ దేశాల ప్రతినిధులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు ఒకే వేదికపై చర్చించేందుకు భారత్ సమిట్ దోహదపడుతుందని తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ వేదికను స్వాగతించాల్సింది పోయి, రాజకీయ కక్షతో దేశ వ్యతిరేక కార్యక్రమంగా చిత్రీకరించడం బాధ్యతాయుతమైన నాయకుల లక్షణం కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, అంతర్జాతీయ పెట్టుబడులు, తెలంగాణ ఖ్యాతిని పెంపొందించే కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై నిర్మాణాత్మక సూచనలు చేయకుండా అనవసర ఆరోపణలు చేయడం ద్వారా బీజేపీ నేతలు తమ రాజకీయ ఆలోచనా విధానాన్ని బయటపెట్టుకుంటున్నారని అన్నారు.తెలంగాణ అభివృద్ధిని, రాష్ట్ర గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు

తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించాలి!

రైతులకు సూక్ష్మ సేద్యంపై అవగాహన కల్పించండి

పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం.. అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం



నిర్మల్, అక్షిత ప్రతినిధి, నవంబర్ 13: నిర్మల్ జిల్లా వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టేలా రైతులను ఆధునిక సాగు పద్ధతుల వైపు మళ్లించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా,అధికారులకు సూచించారు. నీటి వృథాను అరికడుతూ తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే సూక్ష్మ సేద్య విధానాలను రైతులకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంతోపాటు ఉద్యాన పంటల సాగును విస్తృతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, విద్య, ధాన్యం కొనుగోళ్లు, వీధి కుక్కల నియంత్రణ, భూసేకరణ, వివి-జీ రామ్ జీ పథకం తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి ఆదాతోనే వ్యవసాయానికి భరోసా

రైతులకు సూక్ష్మ సేద్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను గుర్తించి ప్రోత్సహించాలని, పంట మార్పిడి ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు అర్హులైన రైతులకు అందేలా చూడాలని ఆదేశించారు.



ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు

వరి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, రైతుల వివరాల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. కొనుగోలు ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యా సంస్థల్లో హాజరుపై ప్రత్యేక నిఘా

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని, సమగ్ర శిక్షా అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

నీటి సంరక్షణకు కార్యాచరణ

వివి-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వెంకట మాధవ రావు, రాథోడ్ రమేష్, డీఈఓ భోజన్న, డీపీఓ శ్రీనివాస్, సీపీఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, నీటిపారుదల శాఖ అధికారులు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు...

పత్తి చేల బాట పట్టిన పిల్లలకు పాఠశాలలో చేరిక

అక్టోబర్ నెలలోఅధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్

పత్తి చేల పనులు వదిలి

పాఠశాల బాట పట్టిన విద్యార్థులు

15వందల మంది పిల్లలకు విముక్తి

పిల్లలు పనిలో కాదు- బడిలోనే ఉండాలి

కోనేరు స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయం

నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: పేద పిల్లల జీవితాలలో వెలుగులు నింపుతున్న కోనేరు స్వచ్ఛంద సంస్థ కృషి అభినందనీయమనీ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అక్టోబర్ నెలలో దసరా సెలవులు రావడంతో విద్యార్థులు పత్తి చేల బాట పట్టారు. మళ్లీ తిరిగి పాఠశాలలు పునర్ ప్రారంభం కావడంతో పాఠశాలలో విద్యార్థులు వెళ్లకుండా పత్తి చేలకు వెళ్తుండగా నాగర్ కర్నూల్ జిల్లాలోని లింగాల, తెలకపల్లి ,బల్మూర్, తాడూర్, బిజినపల్లి, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, మండలాలలో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇందులో జిల్లా బాలల సంరక్షణ విభాగం, విద్యాశాఖ, పోలీస్ శాఖ, చైల్డ్ హెల్ప్ లైన్, కోనేరు స్వచ్ఛంద సంస్థ ల ఆధ్వర్యంలో సంయుక్తంగా అందరూ కలిసి మండలాలలో స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. అట్టి ప్రోగ్రాం ఫలితంగా 1500 వందల మంది విద్యార్థులు పత్తి చేనుకు వెళ్లకుండా తిరిగి పాఠశాలకు పంపించడం జరిగింది. పిల్లలను తరలిస్తున్న వాహనాల డ్రైవర్లకు మరియు పిల్లల తల్లిదండ్రులకు, పిల్లలకు కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి పాఠశాలలకు పంపించడం జరిగింది. విద్యార్థులు రెగ్యులర్ గా పాఠశాలకు వెళుతూ హాజరు శాతం పెరిగింది. మండలాలలో విద్యాశాఖ పోలీస్ శాఖ, బాలల రక్షణ విభాగం, స్వచ్ఛంద సంస్థ ల ఫలితం విద్యార్థుల లో వెలుగులు నింపుతూ విద్యార్థులందరూ రెగ్యులర్గా పాఠశాలలో హాజరై విద్య అభ్యసించే దిశగా కృషి చేశారు. అదేవిధంగా గ్రామాలలో బాలల హక్కుల పై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ నిత్యం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. పిల్లలు అక్రమ రవాలకు గురికాకుండా. బాల్య వివాహాలు జరగకుండా. పిల్లలపై లైంగిక వేధింపులకు గురి కాకుండా, ప్రతినిత్యం హక్కులపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులలో గ్రామాలలో ప్రజలలో చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సదస్సులు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిత్యం గ్రామాలను సందర్శించి బడికి వెల్లనీ పిల్లలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ , వారి కుటుంబాలకు అవగాహన కల్పిస్తూ, పిల్లలను పాఠశాలలో చేర్పించడం జరుగుతుంది. అదేవిధంగా బాల్య వివాహాలకు దగ్గరగా ఉన్న కుటుంబాల పిల్లలకు గ్రామస్థాయిలో ఉన్న అధికారుల సహకారంతో ప్రతి



ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో బాల్య వివాహాల ప్రతిజ్ఞ చేపిస్తూ విద్యార్థులలో అవగాహన పెంపొందిస్తున్నారు. గ్రామస్థాయిలో, మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో అధికారులతో కలిసి పిల్లల హక్కులపై నిరంతరం చర్చిస్తూ, పిల్లల హక్కులకు బంగారు భవిష్యత్తు ఉండేందుకు కృషి చేస్తున్నారు.

పిల్లలందరూ పాఠశాలలో చదివేందుకు కృషి ఎంఏ సలీం కోనేరు సంస్థ డైరెక్టర్, పిల్లలందరూ పాఠశాలలో చదివే విధంగా కోనేరు సంస్థ నుండి ప్రతినిత్యం గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నము, ప్రభుత్వం విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు నెలకొల్పడంతో వాటి గురించి కూడా అవగాహన కల్పిస్తూ విద్య యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేస్తున్నాం. బాల్య వివాహాలు అరికడదాం: జూకీర్ హుస్సేన్ ఏరియా కోఆర్డినేటర్ 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం, బాల్య వివాహాలపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రుల లో కూడా మార్పు రావాలి.

గ్రామీణ పాఠశాలలకు మహర్దశ..!

ఇంటర్ విద్యలో సమూల మార్పులు.. కార్పొరేట్ కళాశాలలకు గట్టి దెబ్బ..?

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా వ్యవస్థ..

2027-28 నుంచి కొత్త విధానం.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఊరట

పదో తరగతి తర్వాత చదువుకు దూరమవుతున్న 40 శాతం మంది విద్యార్థులను తిరిగి విద్యాబాట పట్టించడమే లక్ష్యం





కరీంనగర్ అక్షిత బ్యూరో: ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు.. పదో తరగతి పూర్తికాగానే ఉన్నత విద్య కోసం పట్టణాల బాట పట్టాల్సిన పరిస్థితి. అక్కడ అడుగుపెట్టగానే లక్షల్లో ఫీజులు.. ప్రత్యేక కోచింగ్‌లు.. పరీక్షల ఒత్తిడి.. ఫలితాల కోసం పరుగులు.. వెరసి పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య భారంగా మారుతున్న పరిస్థితులు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నూతన విద్యా విధానం గ్రామీణ విద్యారంగానికి కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా వ్యవస్థను అమలు చేయాలన్న నిర్ణయం విద్యారంగంలో కీలక మార్పులకు నాంది పలకనుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 2027-28 విద్యా సంవత్సరం నుంచి 10+2 విద్యా విధానాన్ని అమలు చేయడానికి అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం పదో తరగతి తర్వాత ప్రత్యేకంగా జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యా వ్యవస్థలోకి తీసుకురానున్నారు. ఈ విధానంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్యగా, ఐదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్యగా, తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించనున్నారు.

55 ఏళ్ల విద్యా వ్యవస్థకు కొత్త రూపం

దాదాపు 55 ఏళ్లుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా విధానంలో మార్పులు తీసుకురావడం రాష్ట్ర విద్యారంగంలో చారిత్రాత్మక పరిణామంగా భావిస్తున్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కొఠారి కమిషన్ సిఫారసుల ఆధారంగా 1969-70 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ విధానం ప్రారంభమైంది. అప్పటి నుంచి పదో తరగతి అనంతరం రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇప్పుడు ఈ విధానాన్ని పాఠశాల విద్యలో విలీనం చేయడం ద్వారా విద్యార్థుల చదువును మరింత నిరంతరాయంగా కొనసాగించే లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తెస్తోంది.

"పదో తరగతి తర్వాత చదువుకు దూరం..!

ప్రభుత్వం దృష్టికి వచ్చిన ప్రధాన సమస్య పదో తరగతి అనంతరం విద్యార్థులు చదువుకు దూరమవుతున్న అంశం. ముఖ్యంగా బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ విద్యలో చేరకుండా మధ్యలోనే చదువును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. సుమారు 40 శాతం మంది విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అంచనా వేస్తోంది. ఈ పరిస్థితిని మార్చి విద్యార్థులు 12వ తరగతి వరకు చదివేలా ప్రోత్సహించడం నూతన విధానం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.



"గ్రామీణ పాఠశాలలకు పునరుజ్జీవనం"

పదో తరగతి వరకు గ్రామాల్లో చదివే విద్యార్థులు ఇంటర్మీడియట్ కోసం పట్టణాలకు వెళ్లడంతో గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. పదో తరగతి తర్వాత విద్యార్థులు వేరే విద్యాసంస్థల్లో చేరాల్సి రావడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడం, రవాణా సమస్యలు తదితర కారణాలు చదువుకు అడ్డంకిగా మారుతున్నాయి.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల స్థాయిలోనే అందుబాటులోకి తీసుకువస్తే గ్రామీణ విద్యార్థులకు స్థానికంగానే ఉన్నత విద్య అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు డ్రాప్‌అవుట్లను తగ్గించేందుకు ఈ విధానం దోహదపడే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో 12వ తరగతి వరకు విద్య అందుబాటులోకి వస్తే గ్రామీణ విద్యావ్యవస్థకు కొత్త బలం చేకూరనుంది.

"ఆశలు ఎన్నో.. అమలే కీలకం..!

నూతన విద్యా విధానం గ్రామీణ విద్యార్థులకు ఆశలు కల్పిస్తున్నప్పటికీ, ఆ ఆశలను వాస్తవంగా మార్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సమర్థవంతమైన బోధన, తగిన వసతులు, విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించగలిగితేనే ఈ నిర్ణయం ఫలితాలను అందిస్తుంది.

గ్రామీణ విద్యార్థికి గ్రామంలోనే ఉన్నత విద్య.. పేద కుటుంబానికి ఫీజుల భారం నుంచి విముక్తి.. ప్రభుత్వ పాఠశాలకు కొత్త బలం.. ఇదే నూతన విద్యా విధానం ముందు ఉన్న అసలైన లక్ష్యం. ఆ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుందో రానున్న విద్యా సంవత్సరమే నిర్ణయించనుంది.

ఉద్యమంలో ఆనాడు ఎన్నికల్లో ఈనాడు

భూపాలపల్లి జిల్లాలో వరంగల్, నల్లగొండ,ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ పర్యటన

అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు దారుణంగా విఫలమయ్యాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ వరంగల్, నల్లగొండ,ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్,తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త సయ్యద్ ఇస్మాయిల్ విమర్శించారు.. గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా పనిచేసినవారు నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని అన్నారు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ ఇస్మాయిల్, ఆ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ పర్యటించారు.. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పర్యటించి అక్కడ పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న నిరుద్యోగులతో కొద్దిసేపు మాట్లాడారు.. గత ప్రభుత్వాలు నిరుద్యోగులను ఎలా మోసం చేశారో వారికి వివరించారు..అనంతరం





సింగరేణి జిఎం కార్యాలయంలో పర్యటించి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమకు సహకరించాలని జిఎంను ,అక్కడ పనిచేసే ఉద్యోగులను కోరారు.. ఆ తర్వాత లాయర్లతో ,కలెక్టర్ కార్యాలయంలో పర్యటించి అక్కడ పనిచేసే ఉద్యోగస్తులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని శ్రీనివాస్ కోరారు..

ఈ సందర్భంగా మీడియా మిత్రులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు.. విద్యార్థినేతగా, ఉద్యమ నేతగా తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని నలమాస శ్రీనివాస్‌అన్నారు..నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.. గత బిఆర్ఎస్ పాలనలో విద్య వ్యాపారమైందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు..తెలంగాణ కోసం పోరాడిన నేను, అవకాశం ఇస్తే నిరుద్యోగుల కోసం పోరాడుతానన్నారు.. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవితక్క ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.. ఇప్పటికైనా యువత, నిరుద్యోగులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని శ్రీనివాస్ కోరారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ ఇస్మాయిల్, రాష్ట్ర అధికార ప్రతినిధి సాజన్,ఉమ్మడి జిల్లా ఇంచార్జి రాజిరెడ్డి, టిఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నరేష్ నేత,ముస్లిం మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధిక్,జిల్లా యూత్ అధ్యక్షులు వినోద్ గౌడ్, విద్యార్థి అధ్యక్షులు విగ్నేష్, సందీప్,టౌన్ ప్రెసిడెంట్ గోవర్ధన్, మహిళా నాయకులు లలిత ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



భద్రాచలం అక్షిత న్యూస్: భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ళీ) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలానికి చెందిన కొల్లు రవి కి రూ.40,000/- మరియు నరసింహారావు పోతురాజు కి రూ.60,000/- చొప్పున మొత్తం రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు) విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యం.. అర్హులకు ప్రభుత్వ సహాయమే ధ్యేయం..

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య



కరీంనగర్ అక్షిత బ్యూరో: శుక్రవారం రోజున భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ అధికారి (డిసిఎల్) కొంటె ప్రసాద్ గారికి లేబర్ కార్యాలయం కలెక్టరేట్ లొ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)జిల్లా ప్రధానకార్యదర్శి పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రధానంగా సంక్షేమ బోర్డులో అవినీతి అక్రమాలను అరికట్టి బోర్డులో సభ్యులుగా కార్మిక నాయకులను చేర్చుకోవాలని, ల్యాబ్స్ అయినా కార్డులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, పెండింగ్లో ఉన్నటువంటి క్లెమ్లను వెంటనే పరిష్కరించి కార్మిక లోకాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.భవన నిర్మాణ పనులు చేసి 50 సంవత్సరాలు దాటిన కార్మికునికి 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని సహజ మరణానికి రెండు నుండి ఐదు లక్షల రూపాయల పెంచాలని ఆయన కోరారు. మెటర్నటీ, మ్యారేజ్ గిఫ్టును లక్ష రూపాయలకు పెంచాలన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దు చేయాలన్నారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుల కుమార్, బత్తుల శ్రీనివాస్ ఐలవేణి రాజ్ కుమార్, రెడ్డి మొండయ్య, నాయకులు వీ రాజు,జి రాజయ్య, ఎం శ్రీనివాస్,ఏ శశి కుమార్,అరవింద్, సాగర్, తిరుపతి,రణధీర్, కే సంపత్ మహేష్,రాజు,రఘు లతోపాటు భవనిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి సందర్భంగా శ్రీ నాగేంద్ర స్వామి ఆలయంలో విశేష పూజలు



మంథని/మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ నాగేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే ఆలయ అర్చకులు స్వామివారికి శాస్త్రోక్తంగా అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు పుట్టలో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి (జూ) మహేష్, గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యులు గందేసిరి సత్యం, జలవంచ సీతారాం, సుంకరి సీతయ్య పాల్గొన్నారు. వీరితో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ మహిళా కళాశాల విద్యార్థుల సత్తా

రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి



కరీంనగర్ అక్షిత బ్యూరో: డిగ్రీ స్థాయిలో నిర్వహించిన 'జిజ్ఞాస' స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో కరీంనగర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి సత్తా చాటారు. కెమిస్ట్రీ, తెలుగు విభాగాల్లో విద్యార్థులు రూపొందించిన రెండు వేర్వేరు ప్రాజెక్టులకు ఈ ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కెమిస్ట్రీ విభాగం లో డాక్టర్ రావుల మొగిలి పర్యవేక్షణలో "ప్రిపరేషన్ అండ్ ఫిజికో కెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఎకో ఫ్రెండ్లీ బయో డిగ్రేడబుల్ పాలిమర్ డిరైవ్డ్ ఫ్రమ్ బనానా పీల్" (అరటి తొక్కల నుండి పర్యావరణ అనుకూల బయో డిగ్రేడబుల్ పాలిమర్ తయారీ) అనే అంశంపై జారా ఫాతిమా, నవ్యశ్రీ, సిరి చందన, వందన, సమీక్ష బృందం ద్వితీయ బహుమతి గెలుచుకుంది. తెలుగు విభాగం లోకాజీపేట వెంకటరమణ పర్యవేక్షణలో "దాశరథి గీతాలు – ఉద్యమ స్ఫూర్తి" అనే అంశంపై ఆశ్రిత, కృపామణి, హస్మిత, అర్చన, రమ్య, కోమలత బృందం రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది.

విజేతలకు మేయర్ శ్రీనివాస్, ఎస్.ఆర్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూడిగ్రీ స్థాయి నుంచే ఇలాంటి ప్రాజెక్టులు చేయడం వల్ల విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని పెద్ద పరిశోధనలు చేసేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ, పీజీ తర్వాత పీహెచ్‌డీలో చేసే పరిశోధనలపై డిగ్రీ స్థాయి నుంచే అవగాహన పెంచుకోవడానికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి గైడ్‌లను కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి , అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

సూర్యాపేట పోలీసుల చాకచక్యం

గంజాయి ముఠా గుట్టురట్టు
112 కిలోల గంజాయి స్వాధీనం
ఇద్దరు అరెస్ట్ - ముగ్గురు పరారీ
ప్రత్యేక టీంతో గాలింపు



సూర్యాపేట , అక్షిత బ్యూరో : ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీసులు రట్టు చేశారు.ఈ ఘటనలో రూ.25 లక్షల విలువైన 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ వెల్లడించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు సంబంధిత వివరాలను వెల్లడించారు.మహారాష్ట్రకు చెందిన ఐదుగురు సభ్యులు కలిసి ఒడిశా ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి 41 ప్యాకెట్లుగా తయారు చేసి ఇన్నోవా కారులో మహారాష్ట్రకు తరలించేందుకు



పథకం రూపొందించారు.పోలీసుల తనిఖీల నుంచి తప్పించు కునేందుకు మరో కారును ఎస్కార్ట్‌గా ముందు నడుపుతూ రవాణా కొనసాగించారు.ఈ క్రమంలో నవంబర్ 7న సూర్యాపేట పట్టణ శివారులోని జాతీయ రహదారి-65పై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో ఇన్నోవా కారు మరమ్మతుకు గురి కావడంతో నిందితులు వాహనాన్ని వదిలి పరారయ్యారు.సమాచారం అందుకున్న సూర్యాపేట రెండవ పట్టణ పోలీసులు తనిఖీ చేయగా కారులో 112 కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయితో పాటు ఇన్నోవా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు దర్యాప్తులో భాగంగా నవంబర్ 12న వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు సూర్యాపేటకు వచ్చిన మహారాష్ట్రకు చెందిన ఆకాష్ విజయ్ దాబేకర్,ఆకాష్ దిలీప్ మోరేలను పోలీసులు అరెస్ట్ చేశారు.వీరి వద్ద మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.కాగా

పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు.గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,యువత భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.గంజాయి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియ జేయాలని ప్రజలను కోరారు.

సిబ్బందికి అభినందనలు.....

ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య,ఎస్సైలు గోపికృష్ణ, రామచందర్,హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్,ఎన్.నవీన్‌లను ఎస్పీ అభినందించారు.సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సహించేది లేదు!

దిలావర్‌పూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి.. కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి



నిర్మల్,అక్షిత ప్రతినిధి నవంబర్ 13 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సజావుగా కొనుగోళ్లు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు అందించే సేవలు, కొనుగోలు ప్రక్రియపై నిర్వాహకులతో మాట్లాడారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని సూచించారు.

రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యం

పంట చేతికొచ్చిన సమయంలో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందగా నిలవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల సమయం వృథా కాకుండా కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్షయ అనిల్, బీజేపీ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, ముత్యం రెడ్డి, రమణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు...

దాతృత్వ స్ఫూర్తిని చాటిన గీతం బీ-స్కూల్ విద్యార్థులు...

మియాపూర్ లోని వివేకానంద సేవా సంఘం చిన్నారులతో ఆహ్లాదంగా ఓ రోజు



పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాదు ఎంబీఏ విద్యార్థులు శుక్రవారం బాలల దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. ప్రతి యేడాది మాదిరే, ఈసారి కూడా 'జాయ్ ఆఫ్ గివింగ్' (ఇవ్వడంలోనే ఆనందం) పేరిట మియాపూర్ లోని వివేకానంద సేవా సంఘం (చిన్నారులు, వృద్ధుల గృహం) చిన్నారులను గీతంకు ఆహ్వానించి, రోజంతా వారిలో ఉత్సాహాన్ని నింపడమే గాక, దయ, దాతృత్వ స్ఫూర్తిని చాటారు. వారిలో కొంగొత్త ఆశలను రేకెత్తించారు. వివేకానంద సేవా సంఘంకు చెందిన స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలోని 41 మంది బాలలను ఎంబీఏ విద్యార్థులు గీతం ప్రాంగణానికి ఆహ్వానించి, వారితో కలిసి ఆనందంగా, వినోదాత్మకంగా, అర్థవంతమైన కార్యక్రమాలతో రోజంతా గడిపారు. ఆ బాలల కోసం ఆకర్షణీయమైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎంబీఏ విద్యార్థులు నిర్వహించారు. తాము అనాథలం కాదు, మనకోసం ఎందరో ఉన్నారనే ఐక్యతా వాతావరణాన్ని సృష్టించడమే గాక, వివిధ పోటీలలో గెలుపొందిన వారందరికీ ఆకట్టుకునే బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో గీతం బీ-స్కూల్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా; రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొని, విద్యార్థుల చొరవను ప్రశంసించారు. ఇంత మంచి సంప్రదాయాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నందుకు అభినందించారు. కీలకమైన నాయకత్వ లక్షణం– కరుణ యొక్క ప్రాముఖ్యతను వారు ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ 'జాయ్ ఆఫ్ గివింగ్' కార్యక్రమాన్ని జీఎస్ బీ అధ్యాపకులు డాక్టర్ నాగప్రియ, డాక్టర్ శ్రీకాంత్, విద్యార్థి నిర్వాహకులు శ్లోక, సుచితలతో కలిసి సమన్వయం చేశారు.

బాలల సంక్షేమం, విద్య పట్ల గీతం యొక్క అచంచలమైన అంకితభావంలో భాగంగా, సేవా సంఘం బాలలందరికీ స్వెట్టర్లు, స్టేషనరీ, టీ-షర్టులను పంపిణీ చేశారు. దీనికి అదనంగా, విద్యార్థులు, అధ్యాపక బృందం కూడా వారి విద్యావసరాలకు మద్దతుగా తమవంతు సహకారాన్ని అందించారు. ఈ వేడుక దానగుణం నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబించింది. చిన్న చిన్న దయగల పనులు ఎలా శాశ్వతమైన చిరునవ్వులను సృష్టించగలవో, చిన్న పిల్లల జీవితాలలో అర్థవంతమైన మార్పును తీసుకురాగలవో ఇది నిరూపించింది.